సాక్షి
అనకాపల్లి
శనివారం । 2 । డిసెంబర్ । 2023



కె.కోటపాడు: వారాడలో పొలం పనుల్లో ఉన్న పింఛన్‌దారునికి పెన్షన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ గణేష్



మునగపాక: సిరసపల్లిలో శుక్రవారం వేకువ జామున పూర్ణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వీరలక్ష్మి



అనకాపల్లి టౌన్: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వెంకుపాలెం గ్రామవాసి మణికంఠకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాజ అప్పారావు

# పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

ఒకటో తేదీ శుక్రవారం తెలతెలవారుతుండగానే వలంటీర్లు లబ్ధిదారుల తలుపు తట్టారు. తమ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. చలిని లెక్క చేయకుండా వేకువజామున 5 గంటలకే వచ్చి పెన్షన్ అందించినందుకు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తొలి రోజే అధిక శాతం మందికి పింఛన్లు అందించినట్టు అధికారులు తెలిపారు.

-కె.కోటపాడు, మునగపాక, అనకాపల్లి టౌన్

## న్యూస్‌రీల్

### రేంజ్ పరిధిలో 78 మంది పోలీస్ సిబ్బంది బదిలీ

- అల్లూరి జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాకు..



పోలీస్ సిబ్బంది బదిలీ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, ఇతర అధికారులు

సాక్షి, అనకాపల్లి: విశాఖ రేంజ్ పరిధిలో 78 మంది పోలీస్ కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. ఏజెన్సీ ప్రాంతం(అల్లూరి జిల్లా)లోని వివిధ పోలీసు స్టేషన్లు, ప్రత్యేక విభాగాల్లో పనిచేస్తున్న ఇద్దరు ఏఎస్‌ఐలు, 45 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 31 మంది కానిస్టేబుళ్లను అనకాపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు స్పౌజ్, మెడికల్ కేటగిరీకి ప్రాధాన్యతనిచ్చి, అత్యంత పారదర్శకంగా బదిలీలు నిర్వహించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. ఏజెన్సీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారికి, అనారోగ్య సమస్యలున్నవారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి వరకు సిబ్బంది వినతులను స్వీకరించి బదిలీ చేశారు. ఖాళీలను స్క్రీన్‌పై ప్రదర్శించి, బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, దిశ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, డీపీవో ఏవో బి.శారద పాల్గొన్నారు.

### రూ.15 లక్షల సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



అప్పారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

సాక్షి, విశాఖపట్నం: అనకాపల్లి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కటుమూరి కనక అప్పారావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన మొత్తాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం అందించారు. అనారోగ్యం కారణంగా అప్పారావు కిడ్నీ, లివర్ పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆ రెండింటిని మార్చేందుకు పెద్ద మొత్తంలో ఖర్చుకావడంతో మంత్రి అమర్‌నాథ్‌ను ఆశ్రయించారు. మంత్రి స్పందించి అప్పారావుకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపట్టారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.15 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించి చెక్కును అనకాపల్లిలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి చేతుల మీదుగా అప్పారావు అందుకున్నారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ రాజు పాల్గొన్నారు.

### పీవోఏ పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్‌సైట్

తుమ్మపాల: అట్రాసిటీ నిరోధక(పీవోఏ) చట్టం నిబంధనల అమలు, రిజిస్ట్రేషన్ పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్ పోర్టల్ అందుబాటులో ఉందని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి టి.అజయ్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖ విచారణ, చార్జ్ షీట్, పరిహారం, ఉత్తర్వులు తదితర అంశాలను లింక్ ద్వారా పరిశీలించుకునే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు poa.apcfss.in వెబ్‌సైట్‌లో ఆధార్, మొబైల్ నంబర్‌ను ఉపయోగించి ఫిర్యాదు స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

### కేజీహెచ్‌లో మరో నకిలీ నియామక ఉత్తర్వు

మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆస్పత్రిలో మరో నకిలీ నియామక ఉత్తర్వులు కొనసాగుతున్నాయి. గత నెల 27న షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు సంబంధించి మహిళ పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ ఆస్పత్రిలో సంచలనం రేపిన సంగతి విదితమే. నాలుగు రోజుల వ్యవధిలో మరో నకిలీ ఉత్తర్వులు బయటపడడంతో సంచలం రేగింది. దీని వెనుక సిబ్బంది పాత్రపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేజీహెచ్ ఎన్‌బీఎస్‌యూ యూనిట్‌లో స్టాఫ్ నర్సుగా తనకు డీఎంహెచ్‌వో నియామక ఉత్తర్వులు ఇచ్చారని ఓ మహిళ అధికారులను సంప్రదించింది. అయితే ఈ యూనిట్ కేజీహెచ్‌లో లేదు. దీంతో అనుమానం వచ్చి పరిశీలించగా నకిలీ ఉత్తర్వులుగా అధికారులు నిర్ధారించారు. దీంతో ఈ విషయాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు.

### బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: తుఫాన్ నేపథ్యంలో తీర ప్రాంతంలో ఈదురు గాలులు బలంగా వీస్తుండడంతో రుషికొండ బీచ్‌లో బోటు షికారు నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో గాలితో పాటు కెరటాలు భారీ ఎత్తున ఎగసి పడుతున్నాయని, ఈ క్రమంలో బోటు షికారు నిలిపి వేశామని పర్యాటకులు దీనిని గమనించాలన్నారు.

## నాలెడ్జ్ హబ్‌గా ఏపీ

బీచ్‌రోడ్డు: ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాలెడ్జ్ స్కిల్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్టుమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాలను శుక్రవారం మీడియాకు ఆయన వివరించారు. స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో స్కిల్స్ క్యాస్కేడ్ ఎకో సిస్టమ్ ద్వారా రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి సంస్థలను పునరుద్ధరణపై దృష్టి సారించామన్నారు. త్వరలో సీఎం చేత విశాఖలో ఏపీ స్కిల్స్ యూనివర్స్ అప్లికేషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

- నేటి సాయంత్రం నుంచి వాయుగుండం ప్రభావం
- రానురాను గాలి వేగం పెరిగి రేపు తుపానుగా బలపడే అవకాశం
- మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరిక
- ప్రభుత్వ యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు



# అప్రమత్తం

కంట్రోల్ రూమ్ నంబర్
08924-222888

తుమ్మపాల: వాయుగుండం ప్రభావం శనివారం మొదలై తుపానుగా బలపడి ఈనెల ఐదో తేదీ వరకు కొనసాగే అవకాశం ఉందని, అనకాపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవాంఛనీయ సంఘటనలు సంభవిస్తే సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మండల స్థాయి అధికారులు, ఆర్డీవో, అనకాపల్లి, నర్సీపట్నం హెడ్ క్వార్టర్స్‌లో కంట్రోల్ రూమ్‌లు తెరవాలని జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి ఆదేశించారు. అన్ని మండల ప్రత్యేక అధికారులు సంబంధిత మండలాల నుంచి పరిస్థితిని పర్యవేక్షించాలని, నియోజకవర్గ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. శనివారం సాయంత్రం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో గంటకు 35-45 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, క్రమంగా పెరుగుతూ 3వ తేదీ నాటికి 55-65 కి.మీ వేగంతో వాయుగుండంగా మారే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్వో ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ సాయంత్రం నుంచి 100 కి.మీ వరకు గాలి వేగం పెరగవచ్చని తెలిపారు. 2వ తేదీ సాయంత్రం నుంచి సముద్రం చాలా ఉధృతంగా ఉంటుందని, 3వ తేదీ ఉదయం నుంచి 5వ తేదీ వరకు మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా జిల్లా మత్స్యశాఖ అధికారి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు తూర్పు తీరంలోని దీవులకు తిరిగి రావాలని సూచించారు.

**తుపాను హెచ్చరికతో వరి రైతుల అప్రమత్తం**

ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఈ నెల 2 నాటికి తుపానుగా మారి, 4వ తేదీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి, పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. కోసిన వరి పైరు పనలను తక్షణమే కుప్పలు, నూర్చి జాగ్రత్త చేసుకోవాలన్నారు. బాగా పక్వానికి వచ్చి గింజ రాలే దశలో ఉన్న వరి పైరును కోత యంత్రంతో కోసుకోవాలన్నారు. వీలైనంత వేగంగా పైరును త్రెషర్ ద్వారా నూర్చుకుని, ఆదివారంలోపు ధాన్యాన్ని సురక్షిత ప్రదేశంలో నీడలో ఆరబెట్టుకుని, జాగ్రత్త చేసుకోవాలన్నారు. భారీ వర్ష సూచన ఉన్నందున కర్ర పచ్చి మీద ఉండి, కోతకు సిద్ధంగా ఉన్న పైరు కోసినా ఆరడానికి సమయం పడుతుంది కనుక కోతను వాయిదా వేసుకోవాలన్నారు. చెరకు పంట గాలులకు పడిపోకుండా జడ చుట్లు వేసుకోవాలన్నారు. ఇతర పంటలపై కూడా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

# దిగ్గజ క్రికెటర్ల సమరం

- నేటి నుంచి విశాఖలో లెజెండ్స్ క్రికెట్ టోర్నీ
- ఇక్కడే నాకవుట్ ఖరారు







శ్రీశాంత్‌తో అభిమానుల సెల్ఫీ

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో మళ్లీ క్రికెట్ సందడి మొదలైంది. ఈ సారి దిగ్గజ క్రికెటర్లు క్రీడాభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచవ్యాప్త మేటి మాస్టర్ క్రికెటర్లతో కూడిన లెజెండ్స్ క్రికెట్ టోర్నీ(ఎల్ఎల్‌సీ)కి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ-స్టేడియం సిద్ధమైంది. శనివారం నుంచి లీగ్ చివరి దశ మూడు టీ-20 మ్యాచ్‌లు జరగనున్నాయి. దేశంలోని ఐదు వేదికల్లో ఈ మ్యాచ్‌లు జరగనుండగా.. నాలుగో వేదికగా వైఎస్సార్ స్టేడియం నిలిచింది. ఇక్కడ జరిగే మ్యాచ్‌ల అనంతరం పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సూరత్ వేదికగా టైటిల్ కోసం నాకవుట్‌లో తలపడనున్నాయి. మాజీ క్రికెటర్లతో కూడిన ఆరు జట్లు తలపడుతుండగా.. విశాఖలో ఐదు జట్లు ఆడనున్నాయి. శుక్రవారం నాలుగు జట్లు విశాఖకు చేరుకున్నాయి.

**ఆధిక్యంలో అర్బన్ రైజర్స్**

టోర్నీలో భాగంగా లీగ్ దశలో ఆరు జట్లు నాలుగేసి మ్యాచ్‌లు ఆడాయి. అర్బన్ రైజర్స్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఆధిక్యంలో కొనసాగుతోంది. గుజరాత్ జెయింట్స్ రెండు మ్యాచ్‌ల్లో విజయంతో ఐదు పాయింట్లు, మణిపాల్ టైగర్స్ మూడు మ్యాచ్‌లే ఆడి నాలుగు పాయింట్లతో తర్వాత స్థానాల్లో నిలిచాయి. విశాఖ వేదికగా టైగర్స్ జట్టు రెండు మ్యాచ్‌లు ఆడనుండగా గుజరాత్ జెయింట్స్, అర్బన్ రైజర్స్ లీగ్ చివరి మ్యాచ్‌లు ఆడనున్నాయి. ఇండియన్ క్యాపిటల్స్, సదరన్ సూపర్ స్టార్స్ జట్లు నాలుగేసి మ్యాచ్‌లాడి ఒకే విజయం సాధించాయి. ఇక బికనీర్ కింగ్స్ ఐదూ మ్యాచ్‌లను పూర్తి చేసి కేవలం ఒకే విజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. జెయింట్స్, టైగర్స్, అర్బన్ రైజర్స్ జట్లు దాదాపుగా నాకవుట్‌కు చేరుకోగా విశాఖలో మ్యాచ్‌లు అనంతరం క్యాపిటల్స్, సదరన్ స్టార్స్ జట్లలో ఓ జట్టు నాలుగో స్థానం సాధించి నాకవుట్‌కు చేరనుంది. వెనుకబడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించనుంది.

**సత్తా చాటుతున్న లెజెండ్స్**

ఇప్పటి వరకు ఆడిన మ్యాచ్‌ల్లో దేశీయ ఆటగాళ్లతో పాటు విదేశీ ఆటగాళ్లు ఆయా జట్ల తరపున సత్తా చాటుతున్నారు. పొదుపుగా బౌలింగ్ చేసిన రైట్ ఆర్మ్ హాఫ్ బ్రేకర్ హర్భజన్ మూడు ఇన్నింగ్స్ ఆడి 11 ఓవర్లు వేశాడు. సూపర్ స్టార్స్‌పై 10 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా కింగ్స్‌పై ఎనిమిది పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. జెయింట్స్‌పై ఓ మెడిన్‌తో 10 పరుగులిచ్చి ఇద్దరిని పెవిలియన్ దారి పట్టించాడు. టాప్ రన్ స్కోరర్లుగా మూడు మ్యాచ్‌ల్లో రిచర్డ్ పావెల్ 126 పరుగులతో, నాలుగు మ్యాచ్‌ల్లో 121 పరుగులతో లెండీ సిమ్మన్స్ కొనసాగుతున్నారు. టాప్ వికెట్ టేకర్లుగా మూడు మ్యాచ్‌ల్లోనే పర్వీందర్, ఇమ్రాన్ ఆరేసి వికెట్లు తీయగా నాలుగు మ్యాచ్‌ల్లో అబ్దుల్ రజాక్ ఆరు వికెట్లు తీశాడు. బ్యాటింగ్ స్ట్రయిక్ రేట్ 250గా రస్టీ రెండు మ్యాచ్‌లో సాధించగా.. అప్పన్న ఒక మ్యాచ్‌లోనే సాధించాడు.

**ఇవీ జట్లు**

- అర్బన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సురేష్ రైనా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. స్మిత్, గుప్టిల్ ఓపెనర్లుగా రానున్నారు. టాపార్డర్‌లో గురుకీరత్‌తో పాటు కెప్టెన్ రైనా ఉంటాడు. క్రిస్, పీటర్, జెరోమ్ బంతులతో చెలరేగనున్నారు. పవన్, స్టువర్ట్, దేవేంద్ర సహకరించనున్నారు. అమిత్ వికెట్ల వెనుక నిలవనున్నాడు.
- గుజరాత్ జెయింట్స్ జట్టుకు పార్థివ్ పటేల్ నాయకత్వం వహిస్తుండగా.. ఓపెనర్లుగా కలీస్, క్రిస్ గేల్ వ్యవహరించనున్నారు. రిచర్డ్, కెవిన్ టాపార్డర్‌లో నిలకడగా రాణిస్తుండగా పార్థివ్ ఈ మ్యాచ్‌లో ఆడకుంటే ధ్రువ్ వికెట్ల వెనుక నిలవనున్నాడు. ఎమ్రిత్, శ్రీశాంత్ బౌలింగ్‌ను ఓపెన్ చేయనుండగా సర్బజీత్, ప్రసన్న, ఈశ్వర్, సులేమాన్‌లు బౌలింగ్‌లో సత్తాచాటనున్నారు.
- మణిపాల్ టైగర్స్ జట్టుకు హర్భజన్ సింగ్ నాయకత్వం వహిస్తుండగా రాబిన్ ఉతప్ప, బద్రీనాథ్ ఓపెనర్లుగా దిగుతారు. హామిల్టన్, మహ్మద్ కైఫ్, పెరీరా టాపార్డర్‌లో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బౌలర్లు మిచెల్, పర్వీందర్, పెరీరా, ఇమ్రాన్, ప్రవీణ్‌తో పాటు కొలిన్ ఉన్నారు.
- గౌతమ్ గంభీర్ సారథిగా వ్యవహరించే ఇండియా క్యాపిటల్స్‌లో రిచర్డ్ పావెల్, జ్ఞానేశ్వర్, ఎడ్వర్డ్స్, కెవిన్ పీటర్సన్, రస్టీ, ఉదానా, బెన్నట్, అప్పన్న, ఆష్లే బౌలింగ్ తదితరులు ఉన్నారు.
- రాస్ టేలర్స్ సారథిగా ఉన్న సదరన్ సూపర్ స్టార్స్ జట్టులో దిల్షాన్, తరంగా ఓపెనర్లుగా దిగనున్నారు. వికెట్ల వెనుక శ్రీవత్స్ నిలవనున్నాడు. టాపార్డర్‌లో చతురంగతో కలిసి టేలర్స్ కొనసాగనున్నాడు. లక్మాల్, దిండా, రజాక్‌తో పాటు హామిద్, బిపుల్, దిల్షాన్, పవన్ నేగీ బౌలింగ్ వేయనున్నారు.

**ఇదీ షెడ్యూల్**

| తేదీ | తలపడనున్న జట్లు | మ్యాచ్ ప్రారంభం |
|---|---|---|
| 2 | ఇండియా క్యాపిటల్స్ x మణిపాల్ టైగర్స్ | సా॥ 6.30 గంటలు |
| 3 | గుజరాత్ జెయింట్స్ x సదరన్ సూపర్‌స్టార్స్ | సా॥ 3 గంటలు |
| 4 | మణిపాల్ టైగర్స్ x అర్బన్ రైజర్స్ హైదరాబాద్ | సా॥ 6.30 గంటలు |

(Paytm Insider (https://insider.in/visakhapatnam)లో టికెట్లు కొనుగోలు చేసి.. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించవచ్చు)

# జిల్లాలో ఎయిడ్స్ తగ్గుముఖం



అనకాపల్లిలో వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



చినగుమ్ములూరు జెడ్పీ హైస్కూల్లో ఎయిడ్స్ అక్షరాకృతిలో విద్యార్థుల ప్రదర్శన

- ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లిటౌన్: జిల్లాలో ఎయిడ్స్ తగ్గుముఖం పడుతూ చాలా తక్కువ స్థాయిలో ఉందని, ఎయిడ్స్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌కు చికిత్స లేదని, మందులతో నియంత్రణ, వ్యాధి పురోగతిని ఆపవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 7,594 మంది ఎయిడ్స్ రోగులు ఉండగా, ప్రభుత్వం 1,933 మందికి పింఛన్ సౌకర్యం కల్పించిందన్నారు. వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యాధి వ్యాప్తికి 90 శాతం విచ్చలవిడి ప్రవర్తనే కారణమని పరిశోధనలో తేలిందన్నారు. 2022-23 ఏడాదిలో ఎయిడ్స్ వ్యాప్తి 0.06 శాతం ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నేటి వరకూ 0.03శాతం మాత్రమే అన్నారు. డీఎల్‌వో డాక్టర్ వీకె బాలాజీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎయిడ్స్ రహిత జిల్లాగా గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బందిచే ఎయిడ్స్ నియంత్రణపట్ల ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ అనంతరం ఎయిడ్స్ రోగులకు పౌష్టికాహారాన్ని కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో జ్యోతి, ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, ఏఆర్‌టీ ఎంవో డాక్టర్ ప్రియదర్శిని, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**క్రిటికల్ కేర్ బ్లాక్ స్థల పరిశీలన**

వైద్యాలయం ఆవరణలో కేంద్రం నిధులతో నిర్మించనున్న క్రిటికల్ కేర్ బ్లాక్ స్థలాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం రూ.22 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో రెండు అంతస్తుల్లో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయనుందన్నారు. వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపీ బీవీ సత్యవతి చొరవతో ఆస్పత్రి భవన నిర్మాణం జరుగుతోందని, మరో అంతస్తు నిర్మించేందుకు ఎంపీ ప్రత్యేకంగా రూ.11 కోట్ల నిధుల కోసం కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. 9 నుంచి 12 మాసాల్లో ఈ భవనం అందుబాటులోకి వస్తుందన్నారు.

**ఆకట్టుకున్న అక్షర విన్యాసం**

ఎస్.రాయవరం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చినగుమ్ములూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న ప్రచారం చేశారు. స్కూలు ప్రాంగణంలో ఎయిడ్స్ ఆకారంలో అక్షర విన్యాసం చేసి ఆకట్టుకున్నారు. ఎయిడ్స్ వ్యాధి సోకే విధానం, దానివల్ల కలిగే ప్రమాదం గురించి ఉపాధ్యాయులు ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు.

## వడ్డాదిలో సాధికార సభా వేదిక పరిశీలన



వడ్డాదిలో సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో జరిగే సామాజిక సాధికార సభా వేదిక పనులు వేగవంతంగా పూర్తయ్యేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఈ నెల 5వ తేదీన నియోజకవర్గంలో బస్సు యాత్ర జరగనున్న నేపథ్యంలో వడ్డాదిలో సభ జరిగే ప్రదేశాన్ని విప్ ధర్మశ్రీ శుక్రవారం పరిశీలించారు. వడ్డాది జంక్షన్‌లో వెంకటేశ్వరస్వామి సినిమా హాలు ప్రదేశంలో సభావేదిక నిర్మాణం చేపట్టి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సీనియర్ నాయకుడు ఎస్ఎస్ఎన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి గేదెల శేషు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, పార్టీ జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు తదితరులకు సూచించారు. నర్సీపట్నం నుంచి చోడవరం వెళ్లే వాహనాలకు ఆటంకం లేకుండా, బస్సుయాత్రకు వస్తున్న వాహనాలు రోడ్లపై ఉండకుండా ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ఎస్ఐ కుమారస్వామి, అదనపు ఎస్ఐ నాయుడులకు విప్ ధర్మశ్రీ సూచించారు.

# సైగ చేసినా రక్షణ



దివ్యాంగ బాలికతో ముచ్చటిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్



దిశ దివ్యాంగ సురక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు, సీపీ రవిశంకర్ తదితరులు

- ఆపద వేళ ఆదుకునేలా 'దిశ దివ్యాంగ సురక్ష'
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- దేశంలోనే తొలిసారిగా విశాఖ పోలీసుల వినూత్న ప్రయత్నం
- పోలీసు కమిషనర్‌కు ప్రశంసల జల్లు

ఏయూక్యాంపస్: ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం మనదని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో విశాఖ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దిశ దివ్యాంగ సురక్ష ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు అన్నివేళలా ప్రభుత్వం రక్షగా నిలుస్తోందన్నారు. ఇందులో భాగంగా విశాఖ పోలీసులు వినూత్న ప్రయత్నానికి అభినందనలు తెలిపారు. మూగవారి కోసం కోసం కేవలం సైగలు చేస్తే చాలు కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేరేలా ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేయడం, అలాగే అంధుల కోసం ప్రత్యేక వాట్సప్ కాల్ చేసేలా ప్రత్యేక నంబర్ కేటాయించడం దేశంలోనే తొలిసారన్నారు. ముఖ్యమంత్రి ప్రజల పట్ల, కష్టాలలో ఉన్నవారిపట్ల ఎలా స్పందిస్తారు అనడానికి దిశ యాప్ ఒక ఉదాహరణగా నిలుస్తోందన్నారు. పొరుగు రాష్ట్రంలో జరిగిన ఒక సంఘటన ఎక్కడా జరగకూడదని, అక్కచెల్లెళ్లకు సంపూర్ణ భద్రత కల్పించే విధంగా దిశ చట్టం, దిశ యాప్ రూపకల్పన చేశారన్నారు. రాష్ట్రంలో సీనియర్ అధికారులు నేడు ముఖ్యమంత్రి ఆలోచనలకు మరింత ముందుకు తీసుకువెళ్లే విధంగా ఆలోచన చేస్తూ ఇటువంటి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. దివ్యాంగులకు ఉపయుక్తంగా నూతన సేవలను రూపకల్పన చేసి అమలు చేసిన పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్‌ను వేదికపై సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

**దివ్యాంగ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం**

రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ దివ్యాంగులు పారిశ్రామికవేత్తలుగా స్టార్టప్‌లో అడుగేస్తే సహకారం అందించి ప్రోత్సహిస్తామన్నారు. సాధారణ వ్యక్తులకంటే మిన్నగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. మరింత సౌలభ్యంతో కూడిన ప్రత్యేక యాప్‌ను రూపకల్పన చేసే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను చేపడుతున్న విశాఖ పోలీసు శాఖను అభినందించారు. నగర మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ గ్రామ సచివాలయాలను ఉపయోగించి ఈ సేవలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేపడతామన్నారు. ఇప్పటికే దిశ చట్టం చరిత్రాత్మకంగా నిలుస్తూ, మహిళలకు అండగా నిలుస్తోందన్నారు. నేడు దివ్యాంగులకు అవసరమైన నూతన దిశ దివ్యాంగ సురక్ష సేవలు అందుబాటులోకి రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ అధికారి బి.శ్రీనివాసరావు, ఎన్‌జీఓ నిర్వాహకురాలు సుచిత్ర తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారుల నృత్యాలు, గీతాలాపన అలరించాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పెద్దసంఖ్యలో పోలీసు అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

**మూగ బాలిక వీడియో కాల్.. నిమిషాల్లో వచ్చిన పోలీసులు**

తాను వైద్యుడిగా సేవలు అందిస్తున్న సందర్భంలో జరిగిన ఒక సందర్భం తనకు ఈ ఆలోచన రావడానికి కారణమని విశాఖ పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ వివరించారు. అంధుల కోసం 73373 24466, మూగవారి కోసం 73374 34422 నంబర్లను ఏర్పాటు చేశామన్నారు. వీరు సంజ్ఞలతో చెప్పే సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌లో ఉండే నిపుణులు విశ్లేషించి వెంటనే వారి వద్దకు పోలీసులను పంపడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి సేవలు అందించే విధానాన్ని ప్రత్యక్షంగా వేదికపై ప్రదర్శించి చూపారు. వేదికపై నుంచి ఒక మూగ బాలిక వీడియో కాల్ చేసి తనకు జరిగిన ఇబ్బందిని కాల్ సెంటర్‌కు వివరించడం, వెంటనే వారు పోలీసు కానిస్టేబుల్‌ని బాలిక వద్దకు నిమిషాల వ్యవధిలో పంపడం ప్రత్యక్షంగా చూపారు.

## ఎస్కార్టు విధుల్లో అప్రమత్తత అవసరం



కైలాసగిరి పోలీస్ మైదానంలో పరేడ్‌ను సందర్శిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు రిమాండ్ ఖైదీలను కోర్టుకు తీసుకెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాఖలో కైలాసగిరి వద్ద ఏఆర్ పోలీస్ మైదానంలో జరిగిన పరేడ్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరేడ్‌లో ఆయనకు పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జైళ్ల నుంచి కోర్టుకు విచారణ కోసం తీసుకెళ్లి, తిరిగి జైల్‌కు తీసుకొచ్చినంత వరకు నిందితులు పారిపోకుండా ఎస్కార్టులో ఉన్న సిబ్బంది చాలా జాగ్రతగా ఉండాలన్నారు. నిందితుల నేర చరిత్రను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి, పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. సిబ్బంది సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌ఐలు బి.రామకృష్ణ, వెంకటరావు, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, నాయుడు పాల్గొన్నారు.

# మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన






జాబ్ మేళాను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్, హాజరైన యువతీయువకులు

మల్కాపురం: రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. జీవీఎంసీ 59వ వార్డులోని జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆండాళమ్మ కళాశాలలో ఏపీ సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ప్రభుత్వ సలహాదారుడు మిలీనియం శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ముందుగా ఈ మేళాను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించారన్నారు. వలంటీర్ వ్యవస్థతో మరో రెండు లక్షల మందికి ఉపాధి చూపారన్నారు. రాష్ట్రానికి ఐటీ కంపెనీలతో పాటు పలు పరిశ్రమలను తీసుకొస్తూ మరికొంత మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగమని చెప్పి మోసం చేశారని, నిరుద్యోగ భృతి ఇస్తామని చేతులెత్తేశారని విమర్శించారు. పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా సేవలు అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని, అలాంటి వ్యక్తి మళ్లీ ముఖ్యమంత్రి అయితే మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇంత చక్కటి మెగా జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉపాధి కల్పనకు చొరవ చూపిన ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం ఇంటర్వ్యూలో ఉద్యోగం సాధించిన పలువురికి ఆయన నియామక పత్రం అందజేశారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి మాట్లాడుతూ తొలి రోజు ఊహించని విధంగా మంచి స్పందన లభించిందన్నారు. ఈ మేళాలో వివిధ కంపెనీల్లో సుమారు 1256 మంది ఉద్యోగాలు పొందారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, పార్టీ పశ్చిమ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, కొణతాల సుధ, గులిగిందల లావణ్య, గుండపు నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మించడంపై హర్షం

- డిప్యూటీ సీఎం బూడికి రైతుల సన్మానం



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును దుశ్శాలువాతో సన్మానిస్తున్న రైతులు

కె.కోటపాడు: మూడడుగుల మేర గోర్జిలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించి రవాణా కష్టాలు తొలగించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని చౌడువాడ గ్రామ సమీపంలో గవరపేట సంతోషి మాత ఆలయం నుంచి శెరీ రోడ్డుకు వెళ్లే గోర్జిని 15 అడుగుల మేర విస్తరించడంతోపాటు సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశారు.

ఈ నిధులతో పనులు పూర్తి కావడంతో రైతులు శుక్రవారం దేవరాపల్లి మండలం తారువలో డిప్యూటీ సీఎంను కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. ఎంతోమంది ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, తమ కష్టాలను గుర్తించి మోక్షం కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయి ప్రసాద్, వార్డు మెంబరు వంటాకు గోవిందరావు, తనకల అప్పలకోటి, అప్పలతాత, సూరిశెట్టి ఈశ్వర అప్పారావు పాల్గొన్నారు.

## అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి అన్నారు. మండలంలోని కందిపూడిలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను రోడ్లు, ఆర్‌బీకేలు, గ్రామ సచివాలయాలు, పీహెచ్‌సీలు, కమ్యూనిటీ సెంటర్ల భవనాల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రూ.5 లక్షలతో వాటర్‌ట్యాంక్, మరో రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఎంపీ హామీ ఇచ్చారు. గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్‌లు పందిరి స్వరాజ్యం, కోడ కోటేశ్వరరావు, గెద్దమూరి శ్రీనివాసరావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి దేవవరపు రాజేష్ ఖన్నా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



రాజుపాలెంలో రహదారి ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యపడుతుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. గ్రేటర్ విశాఖ విలీనగ్రామం రాజుపాలెంలో రూ.2.47 లక్షలతో నూతనంగా నిర్మించిన రహదారిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటు సంక్షేమం, అటు అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బి.వి.సత్యవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఇన్‌ల్యాండ్‌వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పట్టణపార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, జెడ్పీ ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.





## టీడీపీ నాయకులవి చౌకబారు విమర్శలు

- ఎంపీ సత్యవతి



పెద దొడ్డిగల్లులో రోడ్డు ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎటువంటి పసలేదని, కేవలం ఉనికిని కాపాడుకోవడం కోసమే టీడీపీ నాయకులు అభివృద్ధి లేదని చౌకబారు విమర్శలు చేస్తున్నారని అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి అన్నారు. పెద దొడ్డిగల్లులో రూ.25 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే బాబూరావుతో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ప్రభుత్వంపై ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేలకోట్లరూపాయలతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. ఎన్ని పార్టీలు ఏకమైన వచ్చినా మళ్లీ జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ చివరకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో అధికారులు పాల్గొనకుండా అడ్డుకోవాలని చూశారని, కోర్టు మొట్టికాయ వేసిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రచారం చేసుకోవడం తప్పు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు.

చంద్రబాబునాయుడికి తమ ఐదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పుకునే ధైర్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్ విజయలక్ష్మి అప్పలరాజు, ఎంపీటీసీ దుర్గా గోవిందు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పార్టీనాయకులు బొల్లం బాబ్జి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కన్నూరుపాలెం హైస్కూలు విద్యార్థులు



జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు రాజేష్, జ్యోత్స్న



రాష్ట్ర స్థాయి ఖో-ఖోలో తృతీయ స్థానం పొందిన జి. యశస్వినికి అభినందన

కశింకోట: జాతీయ స్థాయి ఖో–ఖో పోటీలకు కన్నూరుపాలెం హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల కాకినాడలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 17 ఏళ్లలోపు విభాగం పోటీల్లో పాల్గొన్న ఈ స్కూలు విద్యార్థులు ఎ.రాజేష్, పి.జ్యోత్స్నలు ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరు మహారాష్ట్రలోని నాసిక్‌లో జాతీయ స్థాయి ఖో–ఖో పోటీలో పాల్గొనున్నట్టు స్కూలు వ్యాయామ ఉపాధ్యాయుడు పీలా వీరునాయుడు తెలిపారు. ఈ విద్యార్థులను జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ ఎస్.శివ, ఎంపీటీసీ సభ్యురాలు కన్నూరు అచ్చియ్యమ్మ, హెచ్‌ఎం ఎస్ఎస్ రామప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

**యశస్వినికి ఖోఖోలో తృతీయస్థానం**

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థిని జి.యశస్విని రాష్ట్ర స్థాయి ఖో–ఖో పోటీల్లో తృతీయ స్థానాన్ని సాధించింది. ఇటీవల గుంటూరులో ఏపీ ఖో–ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీలో ప్రతిభ చూపి తృతీయ స్థానం సాధించిన యశస్వినిని స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## శ్రీనివాస కల్యాణాన్ని విజయవంతం చేయాలి



శ్రీనివాస కల్యాణం ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: అచ్యుతాపురంలో ఈ నెల 26న జరగనున్న శ్రీనివాస కల్యాణాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు కోరారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ తరంగిణి కో–ఆర్డినేటర్ సరిసా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ సహిత విష్ణు సహస్రనామార్చన, శ్రీనివాస పద్మావతి కళ్యాణం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ పాల్గొన్నారు.

## 88 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి నిందితుల పరారీ



గంజాయి, పట్టుబడిన ఆటో, బైకుతో పోలీసులు

రోలుగుంట: నర్సీపట్నం–వడ్డాది ఆర్‌అండ్‌బీ రోడ్డులో 88 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం ఇక్కడ నిండుగొండ కూడలి వద్ద ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో చింతపల్లి నుంచి ఆటోలో తరలిస్తున్న మూడు గోనె సంచుల్లో గంజాయిని గుర్తించారు. గంజాయితోపాటు మోటారుబైకు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్ బాలుడిపై కేసు నమోదు చేసి కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ ఆదేశాలతో జువైనల్ హోమ్‌కు తరలించారు. పరారైన ముగ్గురి నిందితుల కోసం కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## లాడ్జిలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు రమణ

పాయకరావుపేట: పట్టణంలో గల గణేష్ భవన్‌లాడ్జిలో రూమ్‌లో కిటికీకి ఉరి వేసుకుని రమణ(65) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన రమణ అప్పుడప్పుడు ఇక్కడకు వచ్చి, లాడ్జిలో దిగి, చుట్టు పక్కల ఉన్న దేవాలయాలను దర్శించుకుంటాడన్నారు. గురువారం రాత్రి లాడ్జికి వచ్చి రూమ్ తీసుకున్నాడని, శుక్రవారం ఉదయం అతను రూమ్ డోర్ తీయకపోవడంతో అనుమానం వచ్చి లాడ్జి సిబ్బంది గెడను విరగ్గొట్టి డోర్ తీయగా, కిటికీకి ఉరి వేసుకుని చనిపోయిఉన్నాడని తెలిపారు. మృతుని వద్ద మొబైల్ ఫోన్ ఉందని చెప్పారు. ఇతర వివరాలు తెలియరాలేదన్నారు. లాడ్జి యజమాని పి.ఫణికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఆర్‌జేడీ జ్యోతికుమారి



ఉపాధ్యాయుల సమావేశంలో ఆర్‌జేడీ జ్యోతికుమారి

కె.కోటపాడు: టెన్త్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని, అందుకు అనుగుణంగా బోధన చేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి అన్నారు. స్థానిక హైస్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్జెక్ట్‌లలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి మరింతగా అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రస్తుతం పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షల్లో మంచి మార్కులను సాధించిన టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించాలన్నారు. జనవరి చివరి నాటి టెన్త్ సిలబస్‌ను పూర్తి చేయాలని తెలిపారు. రక్తహీనత సమస్య గల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తరువాత ఐరన్ మాత్రలను తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవోలు సత్యనారాయణ, డి.వి.డి. ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

## దోసూరు కార్యదర్శికి డిప్యుటేషన్

అచ్యుతాపురం(అనకాపల్లి): పంచాయతీరాజ్ శాఖ జిల్లా ఉన్నతాధికారులు ఎట్టకేలకు స్పందించారు. అచ్యుతాపురం మండలంలోని దోసూరు పంచాయతీ కార్యదర్శి చంద్రకళను డిప్యుటేషన్‌పై పంపించారు. సర్పంచ్‌కు ఇవ్వాల్సిన జీతాన్ని చెల్లించకుండా కార్యదర్శి దుర్వినియోగం చేశారని స్పందనలో అందిన ఫిర్యాదు మేరకు డీపీవో విచారణ జరిపారు. రూ.70 వేల పైబడి సొమ్ము కార్యదర్శి సోదరుని ఖాతాలోకి వెళ్లినట్టు గుర్తించారు. జిల్లా పంచాయతీ అధికారుల నివేదిక మేరకు కార్యదర్శి సోదరుని ఖాతాలో జమ అయిన సొమ్మును రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో పాటు, కార్యదర్శిని రాంబిల్లి మండలానికి డిప్యూటేషన్‌పై పంపించారు. ఈ విషయమై ఎంపీడీవో విజయలక్ష్మిని వివరణ కోరగా, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శిని డిప్యూటేషన్ వేసినట్టు చెప్పారు.

## హెచ్ఐవీపై అవగాహన పెంచాలి

- వైద్య సిబ్బందికి సబ్ జడ్జి అరుణశ్రీ సూచన

చోడవరం రూరల్: హెచ్ఐవీపై ప్రజల్లో మరింత అవగాహనను పెంపొందించాల్సి ఉందని, వైద్య సిబ్బంది ఈ విషయంలో దృష్టి సారించాలని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ సూచించారు. ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ జడ్జి అరుణశ్రీ మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులకు వర్తించే చట్టాలను గురించి వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్. వినయ్‌కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ సోకకుండా ఉండడానికి నివారణా మార్గాలను విధిగా పాటించాలన్నారు. హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు, వాటి గోప్యత గురించి ఐసీటీసీ కౌన్సెలర్ ఎం.శ్రీనివాస్, ఆరోగ్యపరమైన జాగ్రత్తల గురించి వైద్యులు గైనకాలిస్టు స్మృతి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ జి.హిమబిందు, డెంటిస్టు వి.విజయలక్ష్మి వివరించారు.

## లింగ వివక్ష నేరం



కోటవురట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న డ్వాక్రా సంఘ సభ్యులు

కోటవురట్ల: హింసకు వ్యతిరేకంగా స్వయం సహాయక సంఘాలు పోరాడాలని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష నేరమని చెప్పారు. అనంతరం లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. మానవహారంగాఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. డీపీఎం సంజయ్, ఏపీఎం రమణకుమారి, సీసీ వల్లీ, అప్పలకొండ పాల్గొన్నారు.

## త్వరితగతిన మహిళా మార్టు



మహిళా మార్టును పరిశీలిస్తున్న ఏపీడీ శోభారాణి

ఎస్.రాయవరం: త్వరితగతిన మహిళా మార్టును ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ శోభారాణి అన్నారు. అడ్డురోడ్డు కేంద్రం ఏర్పాటు చేస్తున్న ఈ మహిళా మార్టు పనులను శుక్రవారం ఏపీడీ పరిశీలించారు. వైఎస్సార్ చేయూత డీపీఎం వరప్రసాద్ రావు, ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి ,ఏపీఎం శివ ప్రసాద్, సీసీలు నాయుడు, సత్యవతి, రమణ బాబు, ప్రకాష్, వీర్రాజు, నాగరాజు పాల్గొన్నారు.

## వడ్డాదిలో ట్రాక్టర్ బోల్తా

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో ట్రాక్టర్ తొట్టె బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్, తొట్టెలో కూర్చున్న మరో వ్యక్తి దూకేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పెద్దేరు నది కస్పా కాలువ ఇరుకు గట్టుపై నుంచి వస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిదిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులపై ముందు జాగ్రత్త



రోగులను పరీక్షిస్తున్న కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ వైద్యాధికారి లావణ్య

**కశింకోట:** సీజనల్ వ్యాధులకు గురి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యాధికారి కె.లావణ్య సూచించారు. మండలంలోని లాలంకొత్తూరులో ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగించారు. వ్యాధులు సోకినపుడు సమీపంలోని వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు తమ ఆస్పత్రిలో ఆయుర్వేదిక్ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఆయుర్వేద మందులు అందించారు.

### నేడు మండల సమావేశం

**అనకాపల్లి రూరల్:** మండల పరిషత్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కేవీ నరసింహారావు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఇప్పటికే సమావేశానికి సంబంధించిన అజెండాను సభ్యులకు అందించినట్లు పేర్కొన్నారు.

### గౌరీపరమేశ్వరులను దర్శించుకున్న రత్నాకర్



రత్నాకర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

**అనకాపల్లిటౌన్:** స్థానిక రింగ్‌రోడ్డు పిళ్లావారి వీధిలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరులను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ శుక్రవారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. అంతకుముందు నిర్వాహకులు రత్నాకర్‌ను సత్కరించారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 3,441 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 4,020 | 4,430 |
| మొదటి రకం | 3,890 | 4,360 |
| రెండో రకం | 3,720 | 4,110 |
| మూడో రకం | 3,400 | 3,710 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| ఆదికేశవ | : రాజా |
| కాలింగ్ సహస్ర | : సత్యనారాయణస్క్రీన్-1 |
| విక్రమ్ రాథోడ్ | : సత్యనారాయణస్క్రీన్-2 |
| యానిమల్ | : షిర్డిసాయి |
| కోటబొమ్మాళి | : పర్తిసాయి |
| ------- | : వెంకటేశ్వర |
| సౌండ్ పార్టీ | : శ్రీసత్య |
| మంగళవారం | : రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 17 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్ :** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 438 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 391 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.





ఈమె పేరు కోట్ని కాసులమ్మ. అనకాపల్లి టౌన్‌లో ఉంటారు. భర్త కోట్ని శ్రీనివాసరావు దినసరి కూలీ. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు నవీన్ రెండేళ్ల క్రితం డిగ్రీ పూర్తిచేసి, ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. కుమార్తె స్వాతిసునీత పట్టణంలోని హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఆఖరు ఏడాది చదువుతోంది. రెండు సంవత్సరాలుగా జగనన్న విద్యా దీవెన నగదు బ్యాంక్ ఖాతాలో జమ అయింది. మూడో ఏడాది విద్యా దీవెనకు వలంటీర్ వివరాలు నమోదు చేశారు. వారం రోజుల్లో నగదు జమ అవుతుందని చెప్పారు. మాలాంటి పేద కుటుంబంలో ఆడపిల్లల చదువుకు ప్రభుత్వం చేస్తున్న సాయం ఎంతగానో ఉపయోగపడుతోంది.. గతంలో పిల్లల చదువులకు చాలా ఇబ్బందులు పడ్డామని, జగన్ సీఎం అయ్యాక పిల్లల చదువులపై బెంగ చాలా వరకు తీరిపోయిందన్నారు. ఇప్పుడు తన కుమార్తె చదువుకు అవసరమయ్యే ప్రతిదీ ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతోనే కొనుగోలుచేస్తున్నట్లు కాసులమ్మ ఆనందం వ్యక్తం చేశారు.




# పేదింటి చదువులకు జగనన్న విద్యా దీవెన

- అర్హులైన విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- నాలుగేళ్లలో తల్లిదండ్రుల ఖాతాల్లో రూ.48.13 కోట్ల జమ

**పేదింటి పిల్లల చదువు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కారాదు. ఫీజులు చెల్లించలేని కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువూ మధ్యలో ఆగిపోరాదు. ఇదే ప్రధాన లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న విద్యా దీవెన పథకానికి శ్రీకారం చుట్టారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తల్లిదండ్రుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తోంది. దీంతో తల్లిదండ్రులకు పిల్లల చదువుల బెంగ తీరింది.**

**అనకాపల్లి టౌన్:** ఉన్నత విద్యలు చదవాలనుకునే పేదింటి పిల్లలకు జగనన్న విద్యా దీవెన వరం. అర్హులైన విద్యార్థుల చదువుకు అయ్యే వ్యయాన్ని ఈ పథకంలో భాగంగా ప్రభుత్వమే భరిస్తుంది. మూడు మాసాలకోసారి విద్యా దీవెన నిధుల్ని లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లలో అనకాపల్లి నియోజకవర్గ పరిధిలో రూ.48.13 కోట్ల రూపాయల లబ్ధి చేకూరింది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న బకాయిల్ని కూడా ప్రస్తుత ప్రభుత్వం విద్యా సంస్థల యాజమాన్యాలకు చెల్లించింది. పేదల పిల్లల చదువులకు ఉన్న ఆటంకాలను తొలగించింది.

### నియోజకవర్గంలో జగనన్న విద్యా దీవెన లబ్ధి

| విద్యా సంవత్సరం | అనకాపల్లి జోన్ | | అనకాపల్లి మండలం | | కశింకోట మండలం | |
|---|---|---|---|---|---|---|
| | విద్యార్థులు | లబ్ధి | విద్యార్థులు | లబ్ధి | విద్యార్థులు | లబ్ధి |
| 2019-20 | 2,039 | 6.00 | 1,854 | 4.20 | 1,351 | 2.94 |
| 2020-21 | 2,166 | 4.63 | 1,980 | 3.40 | 1,472 | 2.43 |
| 2021-22 | 2,097 | 5.84 | 2,068 | 4.66 | 1,563 | 3.41 |
| 2022-23 | 1,858 | 4.19 | 1,991 | 3.68 | 1,548 | 2.74 |

### పథకం ప్రధాన లక్ష్యం

రాష్ట్రంలో ఉన్నత విద్యను ప్రోత్సహించాలి. బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా చదువుపై శ్రద్ధచూపలేని పరిస్థితుల్ని తొలగించాలి.

### విద్యాదీవెన వర్తించే కోర్సులు

ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, బీ ఫార్మసీ, డిగ్రీ తత్సమాన, పీజీ తత్సమాన కోర్సులు

### అర్హతలు

ఇంట్లో ఎంత మంది నిర్దేశిత కోర్సులు చదువుతుంటే అంతమందికీ పథకం వర్తిస్తుంది. కుటుంబ ఆదాయ పరిమితిని రూ.2.50 లక్షలకు పెంచారు. 10 ఎకరాల మాగాణి, లేదా 25 ఎకరాల మెట్టపొలం, రెండు కలిపి 25 ఎకరాల్లోపు ఉన్నవారంతా అర్హులే. విద్యార్థుల హాజరు శాతాన్ని పథకం వర్తింపునకు పరిగణనలోకి తీసుకుంటారు. కనీసం 75 శాతం హాజరు తప్పనిసరి. నిర్దిష్ట హాజరు లేకుండా అలాంటి విద్యార్థులు పథకానికి అనర్హులు.

### 'పది మందికి ఉపాధినిచ్చేలా ఎదగాలి'



గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

**కశింకోట:** విద్యార్థులకు ఉద్యోగం సంపాదించడమే ధ్యేయం కారాదని, పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశా లను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై ప్రిన్సిపాల్ గ్రేసీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మంచి ర్యాంకులు సాధిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఉన్నత విద్యను అభ్యసించేందుకు అనేక అవకాశాలు కల్పిస్తున్నాయన్నా రు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, పుస్తకాలను తన సొంత నిధులతో సమకూర్చను న్నట్లు హామీ ఇచ్చారు. అక్కడి నుంచి అడ్డాం వెళ్లారు. భూముల రీ-సర్వేలో పొరపాట్లను రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆర్డీవో చిన్నికృష్ణతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా భూముల రీ-సర్వే చేపట్టారని, రైతులకు ఇబ్బందిలేకుండా పూర్తి చేయాలన్నారు. దీనిపై విచారణ జరిపి రీ-సర్వేలో తప్పులు సవరించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. స్థానికుల వినతి మేరకు అక్కడి ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థ లో ఉన్న పాత భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఫోన్‌లో కోరారు. ఆయన వెంట విశ్రాంత జడ్జి పైల సన్నిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యులు వేగి భాస్కరరావు, దాడి కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొయిలాడ నాగు, చిన్ని జనార్దనరావు, చిన్ని భాస్కరరావు, అడ్డాం సర్పంచ్ చేకూరి మహేశ్వరరాజా, వైస్ ప్రిన్సిపాల్ మెర్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తోనే పేదరిక నిర్మూలన




కూండ్రంలో సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జి.భీమవరంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

**వేడుకగా 'వై ఏపీ నీడ్స్ జగన్'**

**అనకాపల్లి రూరల్:** అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగనన్నను దీవించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కూండ్రం గ్రామంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సంక్షేమ పథకాల వివరాలతో ఉన్న బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పెతకంశెట్టి శివసత్యనారాయణ, జోసెఫ్, బొండా అప్పలరాజు, పార్టీ పాపయ్యసంతపాలెం గ్రామ అధ్యక్షుడు మోహనరావు, మరిపల్లి శోభ, పద్మకుమారి, ఎస్.ఎస్.లక్ష్మి, పద్మ, శానాపతి పెంటారావు, సచివాలయ కన్వీనర్లు ప్రసాదు, అప్పలనాయుడు, లక్ష్మణరావు, యాదగిరి తాతయ్యనాయుడు, యలమంచిలి నాయుడు, నక్కరాజు ప్రభాకర్, యలమంచిలి సన్యాసినాయుడు, మొల్లి గంగునాయుడు, బొబ్బరి శ్రీను, గొర్లి మాధవరావు, యలమంచిలి ఈశ్వరరావు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**కశింకోట:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని జి.భీమవరం సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధి, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగాసామె మాట్లాడుతూ సీఎం జగన్ సచివాలయానికి రూ.20 లక్షల వంతున నిధులు కేటాయించడంతో గ్రామాల్లో రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి అవిరళ కృషి చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్ హనుమంతు వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఈవోఆర్డీ సోమరాజ్, పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

## అతి త్వరలో టిడ్కో గృహాల పంపిణీ

- జనవరి నుంచి అవ్వాతాతలకు రూ.3 వేల పింఛన్
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**అనకాపల్లిటౌన్:** అన్నిరకాల మౌలిక సదుపాయలతో ఈ నెల మూడో వారంలో అర్హులైన లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందించనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక బాలాజీరావుపేట సచివాలయం-13 పరిధిలో, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయం వద్ద నాలుగున్నరేళ్లలో స్థానికంగా జరిగిన అభివృద్ధి, సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమ లబ్ధి వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీ బీవీ సత్యవతితో కలిసి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి నుంచి అవ్వాతాతలకు ప్రభుత్వం రూ.3 వేలు చొప్పున పింఛన్ అందించనున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజలపై అధికారం చలాయించింది తప్ప, వారి సంక్షేమం కోసం పాటుపడిన దాఖలాల్లేవని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలతోపాటు, ప్రజల సంక్షేమాన్ని మరెన్నో కార్యక్రమాలను అమలు చేశారని కొనియాడారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి, ఆ తర్వాత వాటిని పక్కన పెట్టిన ప్రభుత్వాలనే చూసిన ప్రజలు, తొలిసారిగా ఎన్నికల హామీలన్నింటినీ అమల్లోకి తెచ్చిన ముఖ్యమంత్రిగా జగన్‌ను గుండెల్లో పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పింఛన్లు అందిస్తే, ప్రస్తుతం 70 లక్షల మందికి అందిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమ పథకాలకు పైసా అవినీతి లేకుండా రూ.4.70 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినట్లు వెల్లడించారు. ఈ చెల్లింపుల్లో ఎక్కడైనా అవినీతి జరిగినట్లు నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని విపక్షాలకు సవాల్ చేశారు. వచ్చే ఏడాది జనవరి 20న 4వ విడత చేయూత, జనవరి 10న డ్వాక్రా మహిళలకు మిగిలిన రుణమాఫీ నగదును ప్రభుత్వం అందజేయనుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాలయాల్లో జరుగుతోన్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్‌తో ఇబ్బందులు పడుతున్న సమయంలో కూడా మన రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తు, వైద్య సేవలు గొప్పగా అందించిన సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, దేవాలయాల చైర్మన్లు ఆళ్ల నాగేశ్వరరావు, కె.ఎం.నాయుడు, సకాల గోవింద్, సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, పార్టీ నేతలు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, దాడి నారాయణరావు, జెడ్పీ సుర వెంకటరమణ, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



కశింకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



నరసింగబిల్లిలో ర్యాలీలో సిబ్బంది, విద్యార్థులు

**కశింకోట:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై అవగాహన కలిగించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతి రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, సూపర్‌వైజర్లు రామమూర్తి, సత్యవతి, సుభాని, హనుమంతరావు, రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్ విద్యార్థులు తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ ఎయిడ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసాద్, హెచ్‌ఎం బి.సునీత, హెల్త్ అంబాసిడర్ షేక్ బషీర్, ఎంపీహెచ్‌ఈవో కేఎస్‌ఆర్‌కేజీ నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**పరవాడ:** పరవాడ-గాజువాక రహదారిలో గురువారం రాత్రి జాజులవానిపాలెం వద్ద బస్సును ద్విచక్ర వాహనం ఢీ కొన్న ఘటనలో చింతల గొర్లివానిపాలేనికి చెందిన సీహెచ్.రాము(23) మృతి చెందాడు. ఎస్‌ఐ సిరపరపు సురేష్ అందించిన వివరాలు. గురువారం రాత్రి రాము ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్న క్రమంలో జాజులవానిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సును బలంగా ఢీ కొట్టాడు. దీంతో రాము తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేష్ చెప్పారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

**కశింకోట:** ప్రమాదాల నివారణకు వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అనకాపల్లి సీఐ ఎ.రవికుమార్ సూచించారు. కశింకోట, తాళ్లపాలెంలలో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహన చోదకులు రోడ్డుపై ఉన్న ట్రాఫిక్ చిహ్నాలను పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించరాదన్నారు. స్కూల్ పిల్లలను తీసుకెళ్లేటపుడు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రద్దీ సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు సహకరిస్తామని ఆటో డ్రైవర్లు తెలిపారు. ఏఎస్‌ఐ శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## పామాయిల్ సాగుపై అవగాహన

**మునగపాక:** పామాయిల్ తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. తోటాడలో పామాయిల్ సాగు చేపడుతున్న రైతులకు శుక్రవారం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్,ఉద్యానవన శాఖ అధికారి లావణ్య మాట్లాడుతూ మెరుగైన ఆదాయం ఆర్జించేందుకు పామాయిల్ సాగు దోహదపడుతుందన్నారు.

### ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

**మునగపాక:** ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మండలంలోని తోటాడ ఆరోగ్య ఉప కేంద్రం ఆవరణలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు.

## గౌరీపరమేశ్వరులకు ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

**అనకాపల్లిటౌన్:** గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 186వ ఊంజల్ సేవ శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. మళ్ల చంద్రశేఖర్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషసాయిలు ఈ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, స్థానిక భక్తులు పాల్గొన్నారు.